యాదయ్య మృతి బీఆర్ఎస్‌కు తీరనిలోటు

నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల, ఏప్రిల్ 1: మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు వంగాల చిన యాదయ్య గుండెపోటుతో మృతి చెందిన నేపథ్యంలో గురువారం మృతదేహానికి పలువురు నివాళులర్పించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదయ్య అకాల మృతి కుటుంబానికి, బీఆర్ఎస్‌కు తీరని లోటన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బస్వ సావిత్రి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు పల్లా సుందరరాంరెడ్డి, ఏల సుందర్, బస్వ మల్లేశ్,చింత రవి, గండిపల్లి యాకయ్య, సుడిగెల హనుమంతు, తాటిపల్లి మహేశ్, బాషిపాక అంజయ్య, ఇరుక్లు సతీశ్, వంగాల యాకయ్య, దొపాటి మల్లయ్య, ఎడెల్లి వెంకన్న, దొపాటి అనిల్ పాల్గొన్నారు.

సక్కుబాయి మరణం బాధాకరం : ఎర్రబెల్లి

పాలకుర్తి : మండలంలోని టీఎస్‌కే తండాకు చెందిన భూక్యా సక్కుబాయి అలియాస్ బక్కమ్మ పాము కాటుతో మృతి చెందడం బాధాకరమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం సక్కుబాయి మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబాన్ని ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, మాజీ జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, మాచర్ల ఎల్లయ్య, మాజీ సర్పంచ్ దారవత్ బాలునాయక్, భాస్కర్, దేవేందర్, శ్రీనివాస్, మధు, రమేశ్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో స్వరూపారాణి

బచ్చన్నపేట, మే 1 : గ్రామాల్లో పంచాయతీ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగపురి స్వరూపారాణి సూచించారు. జీపీ యాప్ పరిశీలనలో గురువారం మండలం లోని పోచన్నపేటకు ఆమె వచ్చారు. గ్రామంలో మౌలిక సదుపాయాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు.. అనంతరం స్వరూపారాణి మాట్లాడుతూ అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. తడిపోడి చెత్తను వేర్వేరుగా ప్రజలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టాలని, రికార్డులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదింటి పెళ్లికి పుస్తె మట్టెలు అందజేత

బచ్చన్నపేట, మే 1 : మండలంలోని పడమటికేశ్వాపూర్‌కు చెందిన పుష్ప, నర్సయ్య దంపతుల కుమార్తె రాణి వివాహానికి వాస్విక్ ఫౌండేషన్ ప్రతినిధులు ఆముదాల భూపాల్‌రెడ్డి పుస్తెమట్టెలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు ఫౌండేషన్ ముందుంటుందన్నారు. ఆడ బిడ్డల పెళ్లికి తన వంతు సాయం అందించిన ఫౌండేషన్ ప్రతినిధులకు పుష్ప, నర్సయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గిద్దెల రమేశ్, బాలయ్య, కర్ణాకర్, రాకేశ్, ప్రశాంత్, భాస్కర్, క్రాంతి, అరవింద్, రాజు, హరిబాబు, భగత్ పాల్గొన్నారు.

అరుణ పతాకాలతో కవాతు

జిల్లాలో ఘనంగా 'మే డే' వేడుకలు

జనగామలో ర్యాలీగా వస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

జనగామ చౌరస్తా, మే 1 : ప్రపంచ కార్మికులారా ఏకం కండి' అంటూ కార్మికులు, కర్షకులు కవాతు చేశారు. గురువారం సీపీఐ, సీపీఎం అనుబంధ ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు ఏరియా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి వేర్వేరుగా మాట్లాడారు. 12 గంటల పని విధానం రద్దు చేయాలని లక్షాలది మంది కార్మికులు చికాగో నగరంలో చేసిన పోరాటంలో వేలాది మంది ఆత్మ బలిదానాలు చేసినట్లు తెలిపారు. వారి పోరాట ఫలితంగా 8 గంటల పని విధానం అమల్లోకి వచ్చిందని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచేందుకు కుట్రలు చేస్తున్నదని వారు విమర్శించారు. దీనిని అడ్డుకోవడానికి ఈ నెల 20వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఆకుల శ్రీనివాస్, చామకూర యాకుబ్, శ్రీశైలం, నగేశ్, రాజు, యాకయ్య, అయిలయ్య, వీరస్వామి, సిద్ధులు, తిరుమలేశ్, సింగరయ్య, బిచ్చ, జోగు ప్రకాశ్, యాటల సోమన్న, సుంచు విజేందర్, రాపర్తి రాజు, ఇర్రి అహల్య, బూడిద గోపి, శేఖర్, గణేశ్, అజారుద్దీన్, వెంకట మల్లయ్య, లింగం, ప్రశాంత్, బీరయ్య, శ్రావణ్, శ్రీకాంత్, దస్తగిరి, మీట్యా నాయక్, అంజయ్య, మల్లేశ్ రాజ్, అంజమ్మ, ఆనందం, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నర్మెటలో..

నర్మెట : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ పార్టీల నాయకులతోపాటు భవన నిర్మాణ కార్మిక సంఘం, హామాలీ సంఘాల ఆధ్వర్యంలో ఎర్ర జెండాను ఆవిష్కరించారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని కోరారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సీపీఎం, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్,

రఘునాథపల్లిలో..

రఘునాథపల్లి : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో వామపక్షాలు, కార్మిక సంఘాల నాయకులు మేడే వేడుకలను నిర్వహించారు. అరుణ పతాకాలను ఆవిష్కరించిన అనంతరం నాయకులు మాట్లాడుతూకేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను పరిరక్షించాలని కోరారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సీపీఎం, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్, నాయకులు ఎల్లయ్య, రాజు, రవీందర్ రెడ్డి, రాములు, ఈదమ్మ, అశోక్, సుధాకర్, బాలరాజు, శిరీష, హరిస్వర్ధ, మనోహర్, లక్ష్మి, కల్పనతోపాటు సీపీఐ మండల కార్యదర్శి పాండు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

దేవరుప్పలలో..

దేవరుప్పుల : మండల కేంద్రంలో ఏఐటీయూపీ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు గొడిశాల శ్రీనివాస్ జెండాను ఎగురవేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు చింత మాసయ్య, కడవెండిలో బత్తిని వెంకన్న, రామరాజుపల్లిలో కొప్పుల ఉప్పలయ్య, దేవరుప్పులలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సింగారపు రమేశ్, సింగరాజుపల్లిలో రాపాక రంగయ్య, నీర్మాలలో ఇంటి వెంకట్‌రెడ్డి, సీతారాంపురంలో బస్వ రాంచందర్ జెండాలను ఎగురవేశారు.

తరిగొప్పలలో..

తరిగొప్పుల : మండల కేంద్రంతో పాటు అక్కరాజుపల్లి, సోలిపూర్, అంకుషాపూర్, వాచ్చతండా, మానిసింగ్ తండా, జాల్‌బాయ్ తండా, కొత్తతండా, బొత్తలపర్రె, బొంతగట్టునాగారం, అబ్దుల్‌నాగారం, నర్సాపూర్, పోతారం గ్రామాల్లో మేడే వేడుకలను నిర్వహించారు. నాయకులు అంజయ్య, గట్టయ్య, మాటెల్లి శ్రీనివాస్, చింతల బుచ్చయ్య, చింతల మహేందర్, ఎదునూరి నర్సయ్య, మల్లేశం, బోయిని మల్లేశ్,

పాలకుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

గట్టయ్య, నాగరాజు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

జనగామ రూరల్‌లో..

జనగామ రూరల్ : జనగామ మండలంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వామపక్షాలతోపాటు కార్మిక సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తున్న యాజమాన్యాలు సరైన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్ ఘన్‌పూర్ : స్థానిక మున్సిపల్ ఆఫీస్ ముందు, పాత బస్టాండ్ చౌరస్తాలో సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేశ్ ఎర్రజెండాలను ఆవిష్కరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోర్టు చట్టాలను తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నందున దీనికి వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కోడెపాక యాకయ్య, మండల కమిటీ సభ్యులు కుర్ర ఉప్పలయ్య, తోడెంగల ఐలయ్య, చిలుముల్ల భాస్కర్, మునిగేల నరసింహులు, మంద మహేందర్, కత్తుల రాజు, శాఖ కార్యదర్శులు, నాయకులు, వంగపండ్ల సోమయ్య, పోలాసు పద్మాకర్, అమరాజు బాబు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్ : మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. జిల్లా నాయకుడు రాపర్తి సోమయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండీ షబానా, మండల కార్యదర్శి గుండెబోయిన రాజు అరుణ పతాకాలను ఆవిష్కరించారు. నాయకులు కాట సుధాకర్, వడ్లకొండ సుధాకర్ యాదవ్, సమ్మయ్య, మొగులగాని రాములు, ముడికె కొమురయ్య, పిన్నింటి సత్తయ్య, శ్రీను పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి : మండల కేంద్రంలో వామపక్ష పార్టీలతోపాటు వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించి అరుణ పతాకాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాచర్ల సారయ్య, చిట్యాల సోమన్న, సోమ సత్యం, సోమ ఆశోక్‌బాబు, ఈదూనూరి మదార్ పాల్గొన్నారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు మామిండ్ల రమేశ్‌రాజా,గుమ్మడి రాజుల సాంబయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అండతో కొంత మంది కాంగ్రెస్ నాయకులు కమ్యూనిస్టులపై గుండాగిరి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ముస్కు ఇంద్రారెడ్డి, తోట రాజు, వెంకన్న, పెండ్లి భాస్కర్, రాంచంద్రు, వేల్పుల కుమారస్వామి, తాళ్లపల్లి మల్లయ్య, సారయ్య పాల్గొన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే మంచి భవిష్యత్

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



విద్యార్థులను సత్కరిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, మే 1: క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత స్థాయికి ఎదగవచ్చని, ఇందుకు దాతలు సైతం ప్రోత్సాహం అందిస్తారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పదోతరగతిలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులను మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం ఘనంగా సన్మానించి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలని కోరారు. కష్టపడికాక ఇష్టపడి చదువుకోవాలని కోరారు. కాగా మండల వ్యాప్తంగా 14 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదోతరగతి చదివి అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులను ఆయన సన్మానించారు. వీరిలో దేవరుప్పులలోని బాలయేసు పాఠశాల విద్యార్థి కొత్తోజు అర్జున్, ప్రభుత్వ పాఠశాల్లో అత్యధిక మార్కులు పొందిన చినమడూరు విద్యార్థిని గడ్డం కేజియా, దేవరుప్పుల పాఠశాల విద్యార్థి రుతిక, కోలుకొండకు చెందిన ప్రేమ్ చందు, కడవెండికి చెందిన రిషిత,కామారెడ్డిగూడేనికి చెందిన ఐశ్వర్య, పెదమడూరు నుంచి శృతి,నీర్మాలలో నిఖిల్, సింగరాజుపల్లిలో మైత్రి, ధర్మాపురంలో దినేష్, మాధాపురంలో దీక్షిత, కడవెండిలో జాన్డీ బ్రిట్టో ప్రైవేటు పాఠశాల నుంచి సంజయ్, దేవరుప్పుల కస్తూర్బా ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల నుంచి కావ్య, దేవరుప్పుల సాయి ప్రశాంతి విద్యానికేతన్ నుంచి కాముని సిద్ధార్థకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, మండల నాయకులు పల్లా సుందరరాంరెడ్డి, బస్వ మల్లేశ్,గాంధీనాయక్, కుతాలి నర్సింహులు, తాటిపల్లి మహేశ్, ఆగేశం, బండారు రాములు పాల్గొన్నారు.

వివాహ వేడుకలకు హాజరైన ఎర్రబెల్లి

దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లిలో బీఆర్ఎస్ నాయకుడు పగిడిపాటి చంద్రారెడ్డి కుమారుడి వివాహం జరిగింది. దేవరుప్పులలో గంగాడి సువర్ణ కూతురు అంజలి– అనిల్‌రెడ్డి వివాహం, పెదమడూరులో బీఆర్ఎస్ నాయకుడు ఊడుగుల ప్రభాకర్ కూతురు వివాహం, సీతారాంపురంలో పల్సం మల్లయ్య గౌడ్ కుమారుడి వివాహాలు జరిగాయి. వేడుకలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి హాజరై వధూవరులను ఆశీర్వదించి కానుకలు అందజేశారు. సీతారాంపురంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బస్వ వెంకన్న ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా ఎర్రబెల్లి పరామర్శించారు

పాలకుర్తిలో..

పాలకుర్తి : మండలంలోని బమ్మెరకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రంగినేని సత్యనారాయణరావు–స్వరూప దంపతుల కుమార్తె నీరజ–వెంకటశంతన్‌రావు వివాహం మండల కేంద్రంలో జరిగింది. వేడుకలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాచర్ల ఎల్లయ్య, బత్తిని గోపాల్, దారా శారద శంకరయ్య, జోగు గోపీ, గర్వందుల మల్లేశ్, కడుదుల కర్ణాకర్‌రెడ్డి, బానోత్ మహేందర్, లకావత్ సురేశ్, కటారి పాపారావు, కమ్మగాని నాగన్న, వీరమనేని తిమ్మారావు ఉన్నారు.

గులాబీ జెండా ఎగరేస్తున్న బీఆర్‌టీయూ జిల్లా నాయకులు

కేంద్ర ప్రభుత్వ వైఖరిని కార్మికులు ఎండగట్టాలి

జనగామ చౌరస్తా, మే 1 : కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను అందరూ వ్యతిరేకించాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నర్సింగం పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అనుబంధ బీఆర్‌టీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మేడే వేడుకలు నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా, మున్సిపల్ కార్యాలయం వద్ద బీఆర్‌టీయూ కార్మికులు గులాబీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా నర్సింగం మాట్లాడుతూ 8 గంటల పని విధానం కోసం చికాగో నగరంలో లక్షలాది మంది కార్మికులు పోరాటం చేయడంతో పాటు వేలాది మంది ప్రాణత్యాగం చేశారని తెలిపారు. వారి స్ఫూర్తిగా మేడే వేడుకలను ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు జరుపుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ, మున్సిపల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మల్లేశ్, రాజు, ప్రసాద్, ప్రభాకర్, అక్రమ్, సునీ ల్, విజయ్ కుమార్, మల్లయ్య, రాజు, వెంకట స్వామి, నర్సింగం, నాగరాజు, రవి, దేవేంద్ర, లక్ష్మి, శ్రీనివాస్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు సన్మానం

స్టేషన్ ఘన్‌పూర్, మే 1 : ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్మికులను వాసవి వనిత ప్లాటినం క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. క్లబ్ అధ్యక్షురాలు గన్ను కళావతి, ప్రధాన కార్యదర్శి పోకల స్వర్ణమంజుల కార్మికులను సన్మానించి భోజనం అందించారు. మున్సిపల్ కమిషనర్ గొడిశాల రవీందర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సేవలను గుర్తించి సన్మానించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్ను నరసింహులు, మాజీ ఎంపీటీసీ మునిగల రాజు, జీడి రమేష్, మున్సిపల్ అధికారులు శ్రీనివాస్, పూర్ణచందర్, రవీందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన ఫలితాలు

మౌనశ్రీని సన్మానిస్తున్న ఎంపీడీవో సుమన్

జఫర్‌గఢ్, మే 1 : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన ఫలితాలు వస్తాయని, ఇందుకు టెన్త్‌లో వచ్చిన ఫలితాలే నిదర్శనమని ఎంపీడీవో సుమన్ అన్నారు. టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చూపిన మండలంలోని తమ్మడపల్లి (జీ) ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఆయన సత్కరించారు. గురువారం పాఠశాలలో కరాటే శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులు చిలువేరు మౌనశ్రీ 567 మార్కులు, సముద్రాల తేజస్విని 559 మార్కులు సాధించగా ప్రధానోపాధ్యాయులు సీతారామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీరిని సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి హరీశ్, ఉపాధ్యాయుడు సురేశ్ , కరాటే కోచ్ అన్నెపు రాజేందర్ పాల్గొన్నారు.

42వ సారి రక్తదానం చేసిన ఏఆర్ కానిస్టేబుల్

రక్తదానం చేస్తున్న పోచయ్య

జనగామ చౌరస్తా, మే 1 : జిల్లా కేంద్రంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న శాడ పోచయ్య గురువారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 42వ సారి రక్తదానం చేసి తన ఔన్నత్యాన్ని చాటుకున్నారు. పోచయ్య మాట్లాడుతూ భారత దేశంలో ప్రతి ఏటా 10 వేల నుంచి 15 వేల మంది పిల్లలు తలసేమియా (రక్తహీనత) వ్యాధి బారిన పడుతున్నారని తెలిపారు. ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తం అందించడానికి రక్తదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కానిస్టేబుల్ పోచయ్యను పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది అభినందించారు.

కోతుల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

జనగామ చౌరస్తా, మే 1 : జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలో గురువారం సాయంత్రం వాకింగ్‌కు వెళ్లిన ఓ వ్యక్తిపై కోతుల గుంపు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న హేమంత్ బతుకమ్మకుంటలో వాకింగ్ చేస్తుండగా కోతుల గుంపు ఒక్కసారిగా అతడిపై దాడి చేసి గాయపర్చాయి. దీంతో హేమంత్ తల వెనుక భాగంతో పాటు మెడపై గాట్లుపడి రక్తస్రావం జరిగింది. గమనించిన పలువురు కర్రలతో కోతులను చెదరగొట్టడంతో ప్రాణాపాయం తప్పింది. కోతుల బెడదను మున్సిపల్ అధికారులు నివారించాలని పలువురు కోరారు.

కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న బోజన్న

డీఈవోగా బోజన్న బాధ్యతలు స్వీకరణ

జనగామ చౌరస్తా, మే 1 : జిల్లా విద్యాశాఖ అధికారిగా గురువారం బోజన్న బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీఈవోగా పనిచేసిన మాదంశెట్టి రమేశ్ బుధవారం ఉద్యోగ విరమణ పొందడంతో ఏడీగా విధులు నిర్వహిస్తున్న బోజన్నకు డీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విధుల్లో చేరిన డీఈవో బోజన్న జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న కలెక్టర్

చిల్పూరు, మే 1 : మండలంలోని రాజవరం, మల్కాపూర్, చిల్పూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా. గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు తాలు, తేమ లేకుండా ధాన్యాన్ని తీసుకురావాలని రైతులను కోరారు. అనంతరం మల్కాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని ఆయన వైద్యులకు సూచించారు. డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి ఆరోగ్య విషయాలపై ప్రజలకు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, మండల స్పెషల్ ఆఫీసర్ మాధవీలత, ఎంపీవో మధుసూదనాచారి, ఏఈవో వినయ్ కుమార్, మండల వైద్యాధికారి డాక్టర్ కుశాలి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆర్మీ జవాన్‌ను సత్కరించిన ఆర్డీవో

స్టేషన్ ఘన్‌పూర్, మే 1 : రిటైర్డ్ ఆర్మి జవాన్ ఆకునూరి రమేశ్‌ను గురువారం ఆర్డీవో డీఎస్ వెంకన్న సన్మానించారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాకలో పేద కుటుంబంలో జన్మించిన ఆకునూరి రమేశ్ ఉన్నత చదువులు చదివి, ఆర్మీలో సేవలందించారని ఆర్డీవో తెలిపారు. ఆకునూరి రమేశ్ మాట్లాడుతూ సైన్యంలో తాను చేసిన సేవలను గుర్తించి సత్కరించడం ఆనందంగా ఉందన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే స్టేషన్‌ఘన్‌పూర్‌లో అభివృద్ధి

- అసత్యాలను ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కడియం
- దమ్ముంటే పదవికి రాజీనామా చేసి పోటీ చేయాలి
- మాజీ ఎమ్మెల్యే రాజయ్య

చిల్పూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

చిల్పూరు, మే 1 : బీఆర్ఎస్ పాలనలోనే స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. గత సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల దవాఖాన, డిగ్రీ కళాశాల, రూ.104 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు మంజూరు చేస్తే వీటిని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తాను సాధించినట్లు గొప్పలు చెప్పడం సిగ్గుచేటన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి మాలోత్ రమేశ్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నుంచి ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి అధికార దాహంతో కాంగ్రెస్‌లో చేరారని రాజయ్య విమర్శించారు. శ్రీహరికి ద మ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేసి గెలువాలని సవాల్ విసిరారు. గ్లోబెల్స్ ప్రచారానికి బ్రాండ్ అంబాసిడర్ కడియం శ్రీహరి అని విమర్శించారు. కొన్ని రోజులుగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం లో పర్యటిస్తున్న కడియం శ్రీహరి బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే చిల్పూరు గుట్ట దేవస్థానానికి నాటి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి గత సీఎం కేసీఆర్‌తో రూ.10 కోట్లు మంజూరు చేయించానని గుర్తు చేశారు. గుట్టపైకి ఘాట్ రోడ్, కల్యాణ మండపం, చిల్పూరు క్రాస్ రోడ్డు నుంచి వెంకటాద్రి పేట వరకు రోడ్డు, గిరిజన తండాలకు బీటీ రోడ్లు వేయించామన్నారు. మండలంలోని 20 గ్రామపంచాయతీలకు పక్కా భవనాలకు నిధులు మంజూరు చేయించానని రాజయ్య వెల్లడించారు. తాను డిప్యూటీ సీఎంగా ఉన్నప్పుడే వరంగల్‌లో కాళోజీ హెల్త్ యూనివర్సిటీ, కాళోజీ కళాక్ష